నట్టేట ముంచేను

- రైతులను కోలుకోలేని దెబ్బతీసిన వర్షాలు
- ప్రభుత్వం నుంచి కానరాని భరోసా
- ఆర్‌బీకేల్లో అందుబాటులో లేని ఎరువులు
- కంటితుడుపుగా అధికారుల పర్యటనలు

అన్నదాతపై వరుణుడు కన్నెర్ర చేశాడు. అరుగాలం శ్రమించి, పండించిన పంటలను నట్టేట ముంచాడు. ఇటీవల కాలంలో కురుస్తున్న వర్షాలకు వందలాది ఎకరాలు నీటమునగడంతో రైతాంగానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు.. వర్షాలకు నష్టపోయిన రైతాంగానికి సర్కారు భరోసా దక్కకపోగా, పాలకుల నిర్లక్ష్యం తీవ్ర శాపంలా పరిణమించింది.


సామర్లకోట మండలం వీకే రాయపురంలో రెండోసారి నీట మునిగి.. చెరువులను తలపిస్తున్న వరి పొలాలు


సామర్లకోట మండలం పవర గ్రామంలో పంటల దుస్థితి

సామర్లకోట: గత రెండు నెలలుగా కురిసిన వర్షాలకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, ప్రభుత్వం ఆదుకునే పరిస్థితి కానరావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూలైలో కురిసిన భారీ వర్షాలకు వీకే రాయపురం గ్రామంలో సుమారు 300 ఎకరాలు నీట మునగడంతో, రెండో పర్యాయం వరి నాట్లు వేశారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వీకే రాయపురంలోని 400 ఎకరాల్లో పంట పూర్తిగా నీటిలో మునిగి. అక్కరకు రాకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

వెయ్యి ఎకరాల్లో..

మండలంలోని సామర్లకోట ఉప్పువారి సత్రం, భీమవరం, పవర, నవర, చంద్రంపాలెం, వీకే రాయపురం గ్రామాల్లో దాదాపు వెయ్యి ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లి ఉంటుందని రైతులు చెబుతున్నారు. వీకే రాయపురం గ్రామంలోని పొలాలు పూర్తిగా నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. వర్షాలకు గోదావరి కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో. వేట్లపాలెం గ్రామం వద్ద కాలువ సర్‌ప్లస్ వేర్ల గేట్లు ఎత్తివేశారు. దీంతో పంట కాలువ జలాలు వీకే రాయపురం పంట భూములను ముంచేశాయి. వాస్తవానికి ఈ నీరు పొలాల మీదుగా, తూటేరు డ్రెయిన్ ద్వారా ఇంద్రపాలెం ఉప్పుటేరులో కలవాల్సి ఉంది. ఇంద్రపాలెం వద్ద నిర్మించిన బ్రిడ్జి, తూటేరు డ్రెయిన్‌లో పూడికలు పెరిగిపోవడం, గుర్రపు డెక్కతో కాలువ మూసుకోవడంతో డ్రెయిన్ నుంచి నీరు వెనక్కు ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో వీకే రాయపురం రైతులకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఏర్పడింది.

సముద్రంలోకి పోయేలా..!

వేట్లపాలెంలో సర్‌ప్లస్ వైర్ల గేట్లు ఎత్తివేయడం వల్ల కొనేళ్లుగా వీకే రాయపురం పొలాల్లోకి నీరు చేరిందని రైతులు తలారి దొరబాబు, వెలమర్తి బుల్లిరాజు, ఇంటి వెంకట్రావు, వెలమర్తి శ్రీనివాసు చెబుతున్నారు. గోదావరి కాలువలో నీరు సామర్లకోట మీదుగా సముద్రంలోకి పోయేలా అధికారులు చర్యలు చేపట్టి, వీకే రాయపురం పొలాలను ముంపు బారి నుంచి రక్షణ కల్పించాలని రైతులు కోరుతున్నారు. తూటేరు డ్రెయిన్‌లో పూడికలు పూర్తిగా తీయడం ఒక్కటే మార్గమని, అప్పటివరకు వీకే రాయపురం రైతులకు ముంపు సమస్య తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సలహాలతో సరి

ముంపు పొలాలను వ్యవసాయాధికారులు పరిశీలించి, పొలాల్లో నీరు బయటకు పంపాలని సలహా ఇచ్చి.. చేతులు దులుపుకొంటున్నారని రైతులు పెదవి విరుస్తున్నారు. నీరు పోయే మార్గమే లేకపోవడంతో, ఏం చేయాలో దిక్కుతోచడం లేదని వారు వాపోతున్నారు. రైతులకు సబ్సిడీపై విత్తనాలు కానీ, ఇన్‌పుట్ సబ్సిడీ కానీ, పంట బీమా కానీ, రైతు భరోసా కానీ అందలేదని మండిపడుతున్నారు. రూ.20 వేలు రైతు భరోసా ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు రైతులను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పంట నష్టం జరిగిన వెంటనే, నష్టంపై రైతుల పేర్లు నమోదు చేసుకునే అధికారులు.. ప్రస్తుతం పంట నష్టంపై స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల నుంచి నీటిని తీసివేశాక ఎరువులను వేయాలని అధికారులు సూచిస్తున్నారని, ఆర్బీకేల్లో ఎరువులు ఎక్కడున్నాయని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ముంపు పొలాలను పరిశీలించాం



మండలంలో ముంపునకు గురైన రైతుల పొలాలను పరిశీలించాం. పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వీకే రాయపురంలో ముంపు ఎక్కువగానే ఉంది. వేట్లపాలెం సర్‌ప్లస్ వైర్లు ఎత్తివేయడం, వీకే రాయపురం సమీపంలో ఉన్న తూటేరు డ్రెయిన్‌లో నీరు లాగకపోవడం వల్ల ముంపు ఎక్కువగా ఉంది. రెండోసారి రైతులు వరి నాట్లు వేసిన మాట వాస్తవమే. ప్రభుత్వం నుంచి సాయం వస్తే రైతులకు ప్రాధాన్యమిస్తాం.

– ఐ సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

క్లుప్తంగా

నేడు విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం

సామర్లకోట: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక లయన్స్ క్లబ్ ప్రతినిధులు విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించాలని నిర్ణయించారు. గురువారం సాయంత్రం నీలమ్మ చెరువు గట్టుపై ఉన్న లయన్స్ క్లబ్ భవనంలో విశ్రాంత ఉపాధ్యాయులు అల్లవరపు శైలజ, తాళ్లూరి వైకుంఠం, ఎం సత్యంనాయుడును సత్కరిస్తున్నట్టు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ఆర్‌వైవీఆర్ ప్రసాద్, తుమ్మల సత్యనారాయణలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, మాజీ గవర్నర్ లింగమళ్ల కృష్ణమూర్తి ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని చెప్పారు.

లారీ స్టాండ్ రోడ్డును అభివృద్ధి చేస్తాం

రూ.30 లక్షల మంజూరుకు ఎమ్మెల్యే హామీ


లారీ స్టాండ్ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట: పట్టణంలోని 30వ వార్డులో అధ్వానంగా ఉన్న లారీ స్టాండ్ రోడ్డును ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప బుధవారం పరిశీలించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వార్డు కౌన్సిలర్ చలపల్లి వెంకటసత్యనారాయణ ఈ రోడ్డు విషయమై నిలదీసిన సంగతి తెలిసిందే. ఈ రోడ్డు మీదుగా భాస్కర్‌నగర్, కార్పొరేట్ స్కూల్‌కు వెళ్లాల్సి ఉంది. రోడ్డు పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే.. దీనిని పరిశీలించి, రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

రోడ్డును విస్తరించి నిర్మించాలని సూచించారు. ఆయన వెంట లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పబ్బినీడి దుర్గాప్రసాద్, కౌన్సిలర్ బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ అడబాల కుమారస్వామి, ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు వాడపర్తి వీరభద్రరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, మాజీ కౌన్సిలర్లు కరణం కామేశ్వరరావు, బడుగు శ్రీకాంత్, కురుకూరి సోమేశ్వరరావు, రైతు సంఘ అధ్యక్షుడు కంటే బాబు తదితరులు ఉన్నారు.

ఏలేరు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సామర్లకోట: ఏలేరు కాలువ సమీపంలో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఏ శ్రీవిద్య బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ హెల్ప్ లైన్ ఏర్పాటు చేశామన్నారు. మున్సిపాలిటీ నుంచి సాయం కోరే వారు 0884–2327326కు ఫోన్ చేయాలని సూచించారు.

మృతుల కుటుంబాలకు ఎంపీ గీత పరామర్శ


వాకతిప్పలో సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ గీత, నాయకులు

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను బుధవారం మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత పరామర్శించారు. మండలంలోని అమరవల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గొరిసే కాపురెడ్డి సోదరుడు గొరిసే సూర్యచంద్రరెడ్డి, వాకతిప్ప గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పిట్టా సత్యనారాయణ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. వారి కుటుంబాలను ఎంపీ గీత, వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రావు చిన్నారావు, సర్పంచులు పాలని దొరబాబు, పులి జయబాబు, జ్యోతుల చక్రబ్బాయి, ఎంపీటీసీ మేరుగు ఎల్లాజీ, బొందు రాంబాబు, బోరా రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏలేరు ఉధృతిని పరిశీలించిన తహసీల్దార్


సామర్లకోటలో ఏలేరు కాలువ ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ తదితరులు

సామర్లకోట: పిఠాపురం రోడ్డులో ఉన్న ఏలేరు కాలువ ఉధృతిని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఏలేరు ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో అదనపు నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు. దాంతో ఏలేరు కాలువ వెంబడి ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని అప్రమత్తం చేయాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. దాంతో పిఠాపురం రోడ్డులోని ఉప్పువారి సత్రం వద్ద ఏలేరు కాలువ నీటిని ఇరిగేషన్ అధికారి అప్పారావుతో కలిసి తహసీల్దార్ పరిశీలించారు. బుధవారం రాత్రికి ఏలేరు కాలువ ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ మేరకు ఏలేరు కాలువ సమీపంలో ఉన్న వారిని, సత్రం ఎదురుగా ఉన్న టిడ్కో లబ్ధిదారులను అప్రమత్తం చేశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, వీఆర్వో మురళి ఉన్నారు.

పురాతన భవనాల్లో ఉండొద్దు

సామర్లకోట: శిథిల స్థితికి చేరిన, పురాతన భవనాల్లో నివాసం ఉండవద్దని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి హెచ్చరించారు. స్థానిక కరప చెరువు వద్ద లక్కల ప్రకాశరావుకు చెందిన మట్టి ఇల్లు కూలిపోవడంతో, బుధవారం సాయంత్రం దానిని ఆయన పరిశీలించారు. గత పది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో మట్టి గోడలు కూలిపోయే అవకాశం ఉందన్నారు. అటువంటి ఇళ్లలో నివాసం వద్దని సూచించారు. బాధితుడు ప్రకాశరావు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామన్నారు. బాధితులకు ప్రభుత్వ పథకంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తహసీల్దార్‌కు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్,. కురుకూరి సోమేశ్వరరావు, శెట్టిబత్తుల దుర్గారావు విజ్ఞప్తి చేశారు.

తాగి వాహనం నడిపిన వారికి జరిమానాలు

పిఠాపురం: మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి బుధవారం కోర్టు జరిమానాలు విధించినట్టు పిఠాపురం రూరల్ పోలీసులు తెలిపారు. వాహన తనిఖీల్లో భాగంగా పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 9 మందిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పర్చారు. వారికి పిఠాపురం అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.వెంకటఅపర్ణ ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానాలు విధించినట్లు పోలీసులు తెలిపారు.

320 హెక్టార్లలో పంట నష్టం


పిఠాపురం మండలంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

పిఠాపురం: వాయుగుండం ప్రభావంతో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదల కారణంగా పిఠాపురం మండలంలో 320 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు పిఠాపురం ఏడీఏ పి.స్వాతి తెలిపారు. పిఠాపురం మండలం పి. దొంతమూరు, వెల్దుర్తి, రాయవరం, తిమ్మాపురం గ్రామాల్లో ఆమె బుధవారం పర్యటించారు. అధిక వర్షాలకు దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో సుమారు 320 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. పూర్తి స్థాయిలో పరిశీలించి తదుపరి నష్టం వివరాలు వెల్లడిస్తామన్నారు. మండల వ్యవసాయాధికారి అచ్యుతరావు మాట్లాడుతూ ముంపు నీటిని వీలైనంత త్వరగా మురుగు కాల్వల ద్వారా బయటకు పంపి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేస్తే పంట త్వరగా కోలుకుంటుందన్నారు. వర్షాలకు మాగుడు తెగులు సోకి కాండం మెత్తబడే అవకాశం ఉన్నందున మాంకోజెబ్ మందును 3 గ్రాములు లీటరు నీటికి లేదా వాలిడామైసిన్ 2 మిల్లీ లీటర్ల మందు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ ద్వారా పంటనష్టం పరిహారం రావాలంటే తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని అప్రమత్తం చేయండి

- ఈ–కేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలి
- జేడీఏ విజయ్‌కుమార్


వ్యవసాయ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న జేడీఏ విజయ్‌కుమార్

పెద్దాపురం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతాంగాన్ని అప్రమత్తం చేయాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ యంత్రాంగంపై ఉందని జేడీఏ విజయ్‌కుమార్ అన్నారు. పెద్దాపురం వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ శాఖాధికారులు, సిబ్బందితో ఏడీఏ దైవకుమార్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ విజయ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత తుపాను వాతావరణ పరిస్థితుల్లో రైతులకు మరింత అందుబాటులో ఉండి, వారిని అప్రమత్తం చేయాలన్నారు. ఏలేరు నదీ పరివాహక ప్రాంతంలో రైతులు నష్టపోకుండా సరైన సూచనలిచ్చి, వారిని అన్ని విధాలా అప్రమత్తం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రతి గ్రామంలో రైతులకు ఈ–కైవేసీ చేయించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియను మరంత వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఓలు సంజయ్‌కుమార్, అమృత, ఏఈఓ ప్రసాద్, జేడీ కార్యాలయ టెక్నికల్ ఏఓ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక


ప్రసాద్


శ్రీనివాసు


కె దేవప్రసాద్


జి.గంగాధర్

పిఠాపురం: పట్టణ పరిధిలోని కేవైఎస్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న సింగం ప్రసాద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన కాకినాడలో అవార్డు అందుకోనున్నారు. పిఠాపురం మోహన్‌నగర్‌లోని పాఠశాలను ఆయన అందమైన ఉద్యానవనంగా మార్చారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన ప్రసాద్ మాస్టర్‌కు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

శ్రీనివాస్‌కు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గారపాటి శ్రీనివాసు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కాకినాడ జేఎన్‌టీయూలో జరిగే కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకోనున్నారు. గత 28 సంవత్సరాల నుంచి ఉపాధ్యాయ వృత్తిలో విశేష సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా నాటకరంగంలో బాలికల పరిషత్‌ను నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో నంది నాటకాల్లో బాలల విభాగంలో 2014 నుంచి వరుసగా నాలుగుసార్లు రచయితగా, దర్శకుడిగా వ్యవహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన శ్రీనివాస్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు.


అద్దంకి వెంకన్నబాబు


కె రాంబాంబాబు చౌదరి

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

సామర్లకోట: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా మండలం నుంచి ముగ్గురు ఎంపికైనట్టు ఎంఈఓ–2 పి పుల్లయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అధికారుల నుంచి వీరు పురస్కారాలు అందుకుంటారని చెప్పారు. సామర్లకోటలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన కె.దేవప్రసాద్, కాపవరం ఎలిమెంటరీ పాఠశాలకు చెందిన అద్దంకి వెంకన్నబాబు, వేట్లపాలెం, మండల పరిషత్ ఎలిమెంటరీ పాఠశాల–1కు చెందిన కె.బలరాంబాబు చౌదరి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారన్నారు.

పెద్దాపురం: మండల ఉత్తమ ఉపాధ్యాయునిగా ఉలిమేశ్వరం ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న జి.గంగాధర్ ఎంపికైనట్టు ఎంఈఓలు చౌదరి, శర్మ తెలిపారు. వారు విలేకర్లతో మాట్లాడుతూ, గురుపూజోత్సవాన్ని పురష్కరించుకుని ఈ ఏడాది మండలం నుంచి ఆయనను ఎంపిక చేసినట్టు చెప్పారు. పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


ఉప్పాడలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి

కొత్తపల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి అన్నారు. మండలంలోని ఉప్పాడ నాయకర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించార. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల రోజుల పాటు పౌష్టికాహారంపై అన్ని కేంద్రాల్లో అవగాహన కల్పిస్తామని తెలిపారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

మృతుడి కుటుంబానికి నిత్యావసరాల అందజేత

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాదు గ్రామానికి చెందిన కాకాడ లోవరాజు ఇటీవల ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. అతని కుటుంబానికి మత్స్యకార నాయకుడు మడదా విఘ్నేష్, రాజేశ్వరి దంపతులు బుధవారం 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు.

దేశభక్తిని రగిల్చిన ఆర్మీ

- కార్గిల్ యుద్ధ వీరుడు కెప్టెన్ బోగిళ్ల జగదీష్‌కుమార్
- ఉద్యోగ విరమణ సందర్భంగా పౌర సన్మానం


జగదీష్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు

సామర్లకోట: ఆర్మీలో చేరడంతోనే దేశభక్తి పెరిగిందని ఆర్మీ కెప్టెన్ బోగిళ్ల జగదీష్‌కుమార్ అన్నారు. ఆర్మీలో 31 ఏళ్ల పాటు దేశానికి సుదీర్ఘ సేవలందించి, ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా బుధవారం రాత్రి స్థానిక రైతు భవనంలో ఆయనకు పౌర సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన స్నేహితుడితో పాటు ఆర్మీకి దరఖాస్తు చేసి, ఎంపికై సైన్యంలో చేరానని చెప్పారు. తన దరఖాస్తు పూర్తి చేసిన స్నేహితుడు శ్యామ్ ఎంపిక కాకపోవడం బాధ కలిగించిందన్నారు. సైనికునిగా దేశ సరిహద్దులో ప్రజలకు రక్షణగా నిలబడడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 1992లో బెంగళూరు వెళ్లే వరకు ఆర్మీ అంటే ఏమిటో తెలియదన్నారు. దేశ సరిహద్దు 15 వేల కిలోమీటర్లు, ఏడు వేల కిలోమీటర్ల కోస్టల్ ఐల్యాండ్‌లో లక్షలాది మంది సైనికులు సేవలందిస్తున్నారని వివరించారు. సరహద్దు ప్రాంతాల్లో ఏడు దేశాలు ఉంటాయన్నారు. దేశం అంటే బాధ్యతగా పని చేయడం తెలుసుకున్నానని తెలిపారు. కులమతాలకు అతీతంగా పని చేయడంతోనే దేశ ప్రజలు సంతోషంగా ఉంటారని సీనియర్ల ద్వారా, అధికారుల ద్వారా తెలుసుకున్నట్టు చెప్పారు. భూకంపాలు, వరదలు వచ్చిన సమయాల్లో ఆర్మీ సేవలు అందిస్తుందన్నారు. తన తల్లిదండ్రులు, భార్య ప్రోత్సాహం ఎంతో ఉందని తెలిపారు.

'కోట'కు పేరు ప్రతిష్టలు

పట్టణానికి చెందిన బోగిళ్ల జగదీష్‌కుమార్ కార్గిల్ యుద్ధంలో పాల్గొని, దేశానికి సేవలందించడం ద్వారా సామర్లకోట పేరును దేశవ్యాప్తంగా చాటారని పలువురు వక్తలు కొనియాడారు. పౌర సన్మాన సభలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దేశానికి జగదీష్‌కుమార్ చేసిన సేవలను కొనియాడారు. అతని తండ్రి మంచి కబడ్డీ క్రీడాకారుడు కావడంతోనే కుమారులకు కూడా ఏదో సాధించాలనే లక్ష్యం ఏర్పడిందన్నారు, పెద్ద కుమారుడు సైన్యంలో కెప్టెన్‌గా, రెండో కుమారుడు ఫిజికల్ డైరెక్టర్‌గా, ప్రో కబడ్డీ అంపైర్‌గా ఎంపికయ్యారని చెప్పారు. రాష్ట్ర కబడ్డీ మాజీ కోచ్ పోతుల సాయి, మాజీ మున్సిపల్ చైర్మన్ అలమండ చినఅప్పారావు, మాజీ వైస్ చైర్మన్లు గోలి దొరబాబు, గుణ్ణం రాజబ్బాయి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు కొండపల్లి శ్రీనివాసు, తాళూరి వైకుంఠం, బొగిళ్ల మురళీకుమార్, కౌన్సిలర్ బలుసు వాసు, పసల పద్మ రాఘవరావు తదితరులు జగదీష్‌కుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు.

ఆర్‌ఓ ప్లాంట్లు ప్రారంభించిన కలెక్టర్


ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, చిత్రంలో డాక్టర్ లావణ్యకుమారి

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో కోస్టల్ ఆక్వా సంస్థ సౌజన్యంతో నిర్మితమైన నాలుగు శుద్ధి జల కేంద్రాలను కలెక్టర్ షణ్మోహన్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఈఎన్‌టీలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఆడియో మీటర్ సేవలను కలెక్టర్ ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆస్పత్రిలో రోగులు, వారి బంధువులు మంచినీటి కొరత పూర్తి స్థాయిలో తీరనుందన్నారు. కోస్టల్ ఆక్వా యాజమాన్యానికి, ఇందుకు కృషి చేసిన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారిని అభినందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి అధికారులు, కోస్టల్ ఆక్వా ప్రతినిధులు పాల్గొన్నారు.